


TGTEL/25/A31

# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :157 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ శనివారం- 04 - జూలై- 2026

## అమరావతి ఓ భారీ అవినీతి యజ్ఞం...
## త్వరలోనే కోర్టుకు వెళతా




★ రాజధానిపై టీడీపీ, వైసీపీల వాదనలు అర్థరహితమని విజయసాయి రెడ్డి విమర్శ

★ అమరావతి పేరుతో రూ.15 వేల కోట్ల అవినీతికి తెరలేపారని తీవ్ర ఆరోపణ

★ భూములిచ్చిన రైతులకు ప్లాట్లు కేటాయించకపోవడంపై ప్రభుత్వాలను నిలదీత

★ అమరావతి అవినీతిపై పూర్తి ఆధారాలతో త్వరలో కోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి

## దేశంలోనే తొలిసారి.. ఈ-వేలంలో
## విమానాన్ని విక్రయించిన ఈడీ

❖ దేశంలోనే తొలిసారిగా ఈడీ ఈ-వేలం ద్వారా ఓ విమానాన్ని విక్రయించింది.

❖ జులై 1న ఆక్షన్ నిర్వహించగా రూ.3 కోట్లకు సదరు విమానం అమ్ముడుపోవడం విశేషం.

2లో..

ఢిల్లీ : దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800ఖా విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800ఖా విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్లు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన ప్రక్రియ ద్వారా, పీఎంఎల్‌ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు.

## నైరుతి రుతుపవనాలతో
## దేశవ్యాప్తంగా వర్షాలు

### మత్స్యకారులకు ఐఎండీ హైఅలర్ట్ !

● తీరందాటిన నైరుతి రుతుపవనాలు

● దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా వర్షాలు, వరదలు

● పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు రావచ్చని ఐఎండీ హెచ్చరిక




ఢిల్లీ : నైరుతి రుతుపవనాలు పశ్చిమ రాజస్థాన్ లోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. వాయవ్య బంగా ళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడన ప్రభావంతోపాటు, ఇతర వాతావరణ పరిస్థితుల వల్ల రానున్న వారం రోజుల్లో దేశవ్యాప్తంగా, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడడం, ఉరుములతో కూడిన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

**ఏపీ, తెలంగాణలో విస్తారంగా వర్షాలు**

ఐఎండీ ప్రకారం, ప్రస్తుతం దక్షిణ

## అప్పులపై దుష్ప్రచారం..
## మంత్రి జూపల్లికి హరీశ్‌రావు లేఖ..




★ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు..

★ మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు.

★ ఆర్బీఐ గణాంకాలు, అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలను వాట్సాప్ ద్వారా పంపినట్లు వెల్లడించారు.

హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు.. మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై

## రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?
## కేసీఆర్ , హరీశ్ రావులకు భట్టి కౌంటర్ ఎటాక్

▶▶ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్రానికి భారంగా మారాయన్న భట్టి విక్రమార్క

▶▶ చేసిన అప్పులను తక్కువ చేసి చూపించేందుకు కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్య

▶▶ బీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు




మిగతాది 2లో

హైదరాబాద్ : రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో

రూ.8.21 లక్షల కోట్ల అప్పులు : వివిధ మార్గాల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని భట్టి విక్రమార్క అన్నారు. బుకాయింపులు, అసత్యలతో ఎన్నాళ్లు మోసం చేస్తారని మండిపడ్డారు. ఈ అప్పులపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని వెనక్కి తగ్గామని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక, వడ్డీతో కలిపి రూ.2.08 లక్షల కోట్లను చెల్లించామన్నారు. 10 వడ్డీకి కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పులు తెచ్చారన్నారు. వడ్డీల భారాన్ని తగ్గించేందుకు తాము అనేక చర్యలు చేపట్టినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించామన్నారు. రోడ్డుపై నిలబడి అడ్డగోలుగా రోజూ మాట్లా డుతున్నారని మండిపడ్డారు. సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నా రన్నారు. సింగరేణి కోల్ బ్లాక్‌లను పెంచేందుకు చిన్న ప్రయత్నమైనా చేశారా అని భట్టి ప్రశ్నించారు.

అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను కేటీఆర్, హరీశ్ రావులు తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. హరీశ్ రావు మంత్రిగా చేశాననే విషయం మర్చిపోయి అనేక విషయాలపై అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

## రాజకీయ జన్మనిచ్చిన మిడ్జిల్‌కు
## రేవంత్ రెడ్డి..



● తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ప్రాంతానికి రేపు రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు.

● తనకు రాజకీయ జన్మనిచ్చిన నేలపై ప్రజలకు కృతజ్ఞతలు తెలపడంతోపాటు పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు

హైదరాబాద్ : రాజకీయాల్లోకి అరంగేట్రం చేసిన అనంతరం తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచి రేవంత్ రెడ్డి 20 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ప్రాంతానికి రేపు రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. తన రెండు దశాబ్దాల రాజకీయ వార్షికోత్సవాన్ని చేసుకోనున్నారు. జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి వరకు తాను ఎదగడానికి కారణమైన గడ్డకు కృతజ్ఞత చెప్పుకునేందుకు మిడ్జిల్ ప్రాంతంలో రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి మిగతా..2లో

## బంగాళాఖాతంలో అల్పపీడనం - ఏపీలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం

రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం

గంటకు 40-50 కి.మీ వేగంతో వీచనున్న బలమైన ఈదురు గాలులు

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం చల్లబడింది. రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, మిగతా..2లో

## రైలెక్కిన 63.81 కోట్ల మంది

జూన్ 2026లో ప్రయాణికుల రద్దీ సైతం స్థిరంగా పెరిగింది.


రైల్వే మౌలిక సదుపాయాలను అందించడానికి భారతీయ రైల్వే కట్టుబడి ఉందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది.



ఢిల్లీ : దేశ ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా నిలుస్తూ భారతీయ రైల్వే జూన్ 2026లో సరకు రవాణా, ప్రయాణికుల సేవల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. అధిక సరకు లోడింగ్, పెరిగిన ప్రయాణికుల రద్దీ, ఆధునిక సేవల విస్తరణతో సౌకర్యవంతమైన ప్రయాణానికి, సరకు రావాణా వృద్ధికి మొత్తంగా ఆర్థిక వృద్ధికి రైల్వే తోడ్పడుతోంది.

ప్రయాణికుల రద్దీలోనూ జోరు మిగతా..2లో

## ఏపీ అభివృద్ధికి పరిశ్రమలు,
## పెట్టుబడులు అవసరం




★ ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది.

★ విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు.

విజయనగరం, జులై 3: ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది. (శుక్రవారం) జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు.

## అన్నీ మంచి రోజులే - స్టీల్‌ప్లాంట్‌తో
## సీమ చరిత్రలో నవశకం




● సున్నపురాళ్లపల్లె సమీపంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ప్లాంట్ పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

● స్టీల్‌ప్లాంట్‌తో సీమ చరిత్రలో నవశకం మొదలైందన్న చంద్రబాబు

● శ్రీరాయలసీమ బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతామని వ్యాఖ్య

అమరావతి : రాయలసీమ అంటే కరవు నేల కాదని, జలకళ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమ అంటే పచ్చదనం, పరిశ్రమలని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌తో సీమ చరిత్రలో నవశకం మొదలైందన్నారు. ఈ ప్రాంత బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతామని పేర్కొన్నారు. విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రానికి మళ్లీ ప్రాణం పోస్తున్నామని వివరించారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముదు చంద్రబాబు రూ.16,350 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ఉక్కు కర్మాగార పనులను ప్రారంభించారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ బిజీగా మారిందని చంద్రబాబు తెలిపారు. రాయలసీమ స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభించుకున్నామని వివరించారు. రాళ్ల సీమ కాదు, రతనాల సీమ అని చేసి చూపిస్తున్నామని రాబోయే రోజ్లులో రాయలసీమకు అన్నీ మంచి రోజులే అని చంద్రబాబు స్పష్టం చేశారు. "రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైంది. రాయలసీమ అంటే హార్టికల్చర్ హబ్‌గా మారిపోయింది. గతంలో మోసపూరిత శంకుస్థాపనలు చూశాం. మిగతా..2లో

## మంగళగిరి క్షేత్రానికి కొత్త శోభ.. అభివృద్ధి పనులకు
## శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్



● మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి మంత్రి శంకుస్థాపన

● రూ.6.3 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో జీర్ణోద్ధరణ పనులు

● నూతన యాగశాల, శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణకు శ్రీకారం

● భక్తుల సౌకర్యార్థం మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు లోకేశ్ ఆదేశం

● ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని మంత్రి సూచన

అమరావతి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి, జీర్ణోద్ధరణ పనులకు మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## ఏపీ అభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు అవసరం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నారు. రైతులకు భూమికి ఉన్న సంబంధం - తల్లికి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మొదటి దశలో 535 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు వస్తుందని చెప్పారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి వెల్లడించారు. ఎస్.కోట నియోజకవర్గం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో ఎర్ర బస్సు రానిచోట, ఎయిర్‌పోర్టు ఎలా వస్తుందని జగన్ అన్నారని.. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి గతంలో వలసలు వెళ్లేవారని.. ఇప్పుడు ఉత్తరాంధ్రకే వివిధ ప్రాంతాలవారు వలసలు వచ్చే పరిస్థితి ఉందని అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే లలిత కుమారి, ఎమ్మెల్సీలు రఘురాజు, శ్రీనివాస్ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, అధికారులు హాజరయ్యారు.

## అమరావతి ఓ భారీ అవినీతి యజ్ఞం... త్వరలోనే కోర్టుకు వెళతా

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో, రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి తీవ్రమైన ఆరోపణలతో ముందుకొచ్చారు. టీడీపీ 'అమరావతి' అంటుంటే, వైసీపీ 'మావిగన్' అనడం వంటి అర్థరహిత వాదనలను పక్కనపెట్టి, రాజధాని పేరుతో జరుగుతున్న భారీ అవినీతిపై దృష్టి సారించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అమరావతి నిర్మాణం పేరుతో సుమారు రూ.15,000 కోట్ల అవినీతికి పథకం రచించారని, ఈ అవినీతి యజ్ఞంపై పూర్తి ఆధారాలతో త్వరలోనే కోర్టును ఆశ్రయిస్తానని ఆయన సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.ఒక బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను పంచుకుంటున్నానంటూ విజయసాయి రెడ్డి పలు కీలక ప్రశ్నలను సంధించారు. "రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా ఇంకా రాజధాని ఎక్కడో తేల్చకుండా చర్చించడం అందరూ సిగ్గుపడాల్సిన విషయం కాదా? 2029 ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలే నిర్ణయించాలా ఈ రాజకీయ చదరంగానికి అన్ని పార్టీలు బాధ్యత వహించవద్దా?" అని ఆయన నిలదీశారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికను ఎందుకు పక్కనపెట్టారని ఆయన ప్రశ్నించారు. అమరావతి నిర్మాణంలో జరుగుతున్న అవినీతిని ఆయన వివరంగా ఆరోపించారు. "ప్రస్తుత ప్రభుత్వం రాజధాని నిర్మాణం కోసం రూ.50,000 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతి నిర్మాణంలోనూ అంచనాలను భారీగా పెంచి చూపారు. ఇది 'దేవతల నగరం' అనే బ్రాండింగ్‌తో సాగుతున్న అతిపెద్ద అవినీతి పథకం. అధికారంలో ఉన్నవారు 25 నుంచి 30 శాతం వరకు కమీషన్లుగా దండుకుంటున్నారు. అంటే ఇది సుమారు రూ.15,000 కోట్ల లంచాల స్కామ్. అసలు అమరేశ్వర ఆలయం, బుద్ధుని విగ్రహం ఉన్న ప్రాంతానికి, ఇప్పుడు భవనాలు కడుతున్న ప్రాంతానికి 50 కిలోమీటర్ల దూరం ఉంది. ఆ అమరావతి పుణ్యక్షేత్రం అయితే, ఈ అమరావతి అవినీతి ప్రవహించే క్షేత్రం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. మొదటి దశ భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ ప్లాట్లు కేటాయించకపోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజధాని కోసం లక్ష ఎకరాలతో ఏం చేస్తారని నిలదీశారు. విభజన చట్టంలోనే వీజీటీఎం (విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి) అభివృద్ధి ప్రస్తావన ఉన్నప్పుడు, ఆ ప్రాంతమంతా రాజధాని భవనాలను విస్తరిస్తే నష్టమేమిటని ఆయన సూచించారు. వైసీపీ 'మావిగన్' అనడం వల్ల ప్రయోజనమేంటని, ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల గతేంటని ఆయన ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం అంటే పార్టీలు కమీషన్లు దండుకోవడం కాదని హితవు పలికారు. అమరావతి పేరుతో జరుగుతున్న ఈ అవినీతిపై ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో, ప్రజాపక్షాన త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా? - కేసీఆర్ , హరీశ్ రావులకు భట్టి కౌంటర్ ఎటాక్

బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వారు చెప్పే అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. నిశ్శబ్దంగా ఉంటే వ్యవస్థలకు నష్టం చేసిన వాళ్లమవుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పాలన చేశారన్నారు. ఆ పార్టీ నేతలు కావాలని పదేపదే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఆ పార్టీ వారు అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కేసీఆర్ మాట్లాడాలని ఆయన సవాల్ విసిరారు. అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. "హాస్టల్ పిల్లలకు క్వాలిటీ వస్తువులు ఇవ్వాలనే టెండర్లు పిలిచాం. రూ.1,142 కోట్లకు టెండర్లు పిలిస్తే రూ.2 వేల కోట్ల అవినీతి అంటున్నారు. మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా. పదేళ్లపాటు దోపిడీ చేసింది ఎవరు కేసీఆర్ కాదా? రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేసీఆరే బయటకు వచ్చి మాట్లాడాలి. బాధ్యతగా పనిచేస్తున్న మంత్రులపై అభాండాలు సరికాదు. ఎవరి స్థాయి ఏమిటో వారు పోషించే పాత్రతో తెలుస్తుంది. మీరు చేసిన అప్పులు తీర్చేది కాళేశ్వరం కార్పొరేషనా, ప్రభుత్వమా. కీలక విషయాలపై కేసీఆర్ మాట్లాడాలి.. కేటీఆర్, హరీశ్‌రావు కాదు. మీరు చేసిన అప్పులు రాష్ట్రానికి పెనుభారంగా మారాయి"- భట్టి విక్రమార్క, ఉపముఖ్యమంత్రి సింగరేణి బొగ్గు ఆరోపణలపై విచారణకు ఆదేశం : సింగరేణికి నష్టం కలిగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. కోల్ బ్లాక్ లు తెచ్చుకునేందుకు కేంద్రంతో మాట్లాడుతున్నామన్న ఆయన సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. సింగరేణిపై ావాలనే బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణికి కొత్త బ్లాక్ లు రాకుండా అడ్డుకున్నది కేటీఆర్, హరీశ్ రావులేనని భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణిలో బొగ్గుమాయమైందని కేటీఆర్, హరీశ్ రావులు చేసిన ఆరోపణలపై స్పందించిన భట్టి విక్రమార్క వాటిపై విచారించాలని ఆ సంస్థ విజిలెన్స్ డైరెక్టర్ ను ఆదేశించారు. సింగరేణికి నష్టం కలిగిస్తే నష్టపోతేది రాష్ట్రప్రజలేనని ఆయన తెలిపారు.

## అప్పులపై దుష్ప్రచారం.. మంత్రి జూపల్లికి హరీశ్‌రావు లేఖ..

కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ.1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,86,067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ.3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ తమ లెక్కలను మార్చడం లేదని, కాంగ్రెస్ మాత్రం సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియోలు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్‌రావు, ఇకనైనా అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

## దేశంలోనే తొలిసారి.. ఈ-వేలంలో విమానాన్ని విక్రయించిన ఈడీ

ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ ప్రక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## రాజకీయ జన్మనిచ్చిన మిడ్జిల్‌కు రేవంత్ రెడ్డి..

జన్మనిచ్చిన నేలకు వందనం చెప్పేందుకు రేవంత్ రెడ్డి వెళ్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. రేపు శనివారం ముఖ్యమంత్రి నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ప్రజాప్రతినిధిగా తన తొలి విజయానికి వేదికైన మిడ్జిల్ మండలానికి ముఖ్యమంత్రి హోదాలో వెళ్లనుండడంతో ఈ పర్యటన రాజకీయంగా, భావోద్వేగంగా ప్రత్యేకత సంతరించుకుంది. తనకు రాజకీయ జన్మనిచ్చిన నేలపై ప్రజలకు కృతజ్ఞతలు తెలపడంతోపాటు పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు.

షెడ్యూల్ ఇదే!

రేపు ఉదయం 11.45 గంటలకు హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాకు బయలుదేరుతారు. 12.30 గంటలకు ఉర్కొండపేట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఆంజనేయస్వామి గుడికి వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ చేసి శంకుస్థాపన. అనంతరం ఆలయ ఆవరణలో తన తొలి రాజకీయ ప్రయాణంలో వెంట నడిచిన ఆనాటి అనుచరులు, ముఖ్య నాయకులు, ఆనాటి పెద్దలతో మాటామంతీ జరపనున్నారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేయనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఉర్కొండపేట నుంచి రోడ్డు మార్గంలో మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌కు బయలుదేరుతారు. 2.45 గంటలకు మిడ్జిల్ మండలం వెల్జాల క్రాస్ రోడ్డుకు చేరుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మధ్యాహ్నం 3 గంటలకు మిడ్జిల్ బహిరంగ సభా ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు చేయనున్నారు.సాయంత్రం 3.15 గంటలకు మిడ్జిల్‌లో జరిగే బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగం

కృతజ్ఞతా సభ

2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా గెలిచి ప్రజాప్రతినిధిగా రాజకీయాల్లో తొలి అడుగు వేసిన రేవంత్ రెడ్డి, 20 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న వేళ అదే నేలపై ముఖ్యమంత్రిగా ప్రజలకు తన కృతజ్ఞతలు

## బంగాళాఖాతంలో అల్పపీడనం - ఏపీలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ మేరకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పలు సూచనలు జారీ చేసింది. మరింత బలపడనున్న అల్పపీడనం : వాయవ్య బంగాళాఖాతంలో తాజా అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలను ఆనుకుని కేంద్రీకృతమై ఉంది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఆ జిల్లాల్లో వానలు : శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఏలూరు, శ్రీకాకుళం జిల్లాల్లో వానలు పడతాయి. పశ్చిమగోదావరి, కోనసీమ,



పోలవరం జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయి. ఇక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మిగిలిన అన్ని జిల్లాల్లో వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయి. కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వివరించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణకు భారీ వర్ష సూచన : అల్పపీడన ప్రభావం తెలంగాణపై కూడా తీవ్రంగానే ఉండనుంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సైతం వానలు దంచికొట్టనున్నాయి. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇక దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వివరించారు. ప్రాజెక్టులకు జలకళ, ఖరీఫ్ రైతులకు శుభవార్త : అల్పపీడనం ప్రభావంతో పోలవరం జిల్లా రంపచోడవరం మన్యంలో గత వారం రోజులుగా విస్తారంగా వానలు పడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. భూపతిపాలెం, ముసరిమిల్లి జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సూరంపాలెం, మద్దిగడ్డ ప్రాజెక్టులు సైతం నిండుకుండలను తలపిస్తున్నాయి. జలాశయాల్లోకి భారీగా నీరు చేరడంతో వ్యవసాయానికి ఊతం లభించింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్

## అన్నీ మంచి రోజులే - స్టీల్‌ప్లాంట్‌తో సీమ చరిత్రలో నవశకం

మొదటి పేజీ తరువాయి

2019 డిసెంబర్‌లో ఒకసారి, 2023లో రెండోసారి భూమిపూజ చేశారు. తట్ట మట్టి అయినా తీశారా? చిన్న భవనమైనా కట్టారా?రాయలసీమలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ముందే మాట ఇచ్చాం. అడ్డంకులన్నీ తొలగించుకొని వచ్చాం. 1100 ఎకరాలు భూమి ఇచ్చాం. రూ.16,350 కోట్లతో ఫేజ్-1, 2 ఉక్కు కర్మాగారానికి నాంది పలికాం. మొదటి దశ రూ.4,500 కోట్లు, రెండో దశ రూ.11,850 కోట్లు. సోలార్ ఎనర్జీకి రూ.20,350 కోట్లు ఖర్చు పెట్టబోతున్నారు. రెండు స్టేజీల్లో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతుంది.ఇంకా పెద్దఎత్తున పెట్టుబడులకు సజ్జన్ జిందాల్ సిద్ధంగా ఉన్నారు." - చంద్రబాబు, ముఖ్యమంత్రి 'జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ప్లాంట్‌తో ఏపీ ఉక్కు రాష్ట్రంగా తయారవుతుంది. విశాఖ మాత్రమే కాదు, రాయలసీమ కూడా ఉక్కుకు కేంద్రమవుతోంది. ఉక్కు రాయలసీమగా మారబోతోంది. నాలుగు దశాబ్దాల క్రితం మొదలైన విశాఖ ఉక్కు రాష్ట్రానికి తలమానికంగా ఉంది. సంక్షోభ సమయంలో ప్రధానితో మాట్లాడి రూ.11.440 కోట్లు ఆర్థికసాయం తెచ్చాం. లాభాల బాటలో విశాఖ ఉక్కు ముందుకెళ్లే పరిస్థితి తీసుకొచ్చామని' చంద్రబాబు పేర్కొన్నారు. "దేశంలోనే తొలిసారిగా గ్రీన్ ఎనర్జీతో గ్రీన్ స్టీల్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఇది. జేఎస్‌డబ్ల్యూ సంస్థకు కావాల్సిన భూమి ఇచ్చాం. రాయలసీమ చరిత్ర మార్చేలా ఈ ప్లాంట్ ఉంటుంది. గతంలో స్టీల్‌ప్లాంట్ అని భ్రమ కల్పించారు, ఎయిర్‌పోర్టు అన్నారు. ఓబులాపురం గనుల పేరు చెప్పి దోపిడీ చేసి ఐరన్ ఓర్‌ను విదేశాలకు పంపారు. దేశంలో ఉండే ఖనిజ సంపద విదేశాలకు ఎవరు తరలించారో అందరికీ తెలుసు. రాయలసీమ ఖనిజ సంపదతో రాయలసీమలోనే సంపద సృష్టిస్తానని హామీ ఇస్తున్నా. రాయలసీమలోనే స్టీల్ తయారుచేస్తాం." - చంద్రబాబు, ముఖ్యమంత్రి రాష్ట్రంలో 11 లక్షల 50 వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు వెల్లడించారు. పెట్టుబడుల వల్ల 9 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వలసలు పోయే పనే లేదని, రాయలసీమలోనే ఉద్యోగాలొస్తాయని వివరించారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో కడపకు ఏం చేసిందో చెప్పగలరా అని ప్రశ్నించారు. రాబోయే 24 నెలల్లో పనులు పూర్తిచేసే బాధ్యత తమదన్నారు. 2028 జులై 3న మళ్లీ వస్తానని, ప్లాంట్ ప్రారంభిస్తానని చంద్రబాబు స్పష్టంచేశారు. "ఆగస్టు 15 లోగా లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు మదనపల్లెలో శంకుస్థాపన చేస్తాం. రూ.40,000ల కోట్లు ప్రభుత్వం భరిస్తే, రూ.60,000ల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు వస్తాయి. హార్టికల్చర్‌లో రాయలసీమను ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం. రాయలసీమను పర్యాటక కేంద్రంగా తయారుచేస్తాం." - చంద్రబాబు, ముఖ్యమంత్రి 'రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించాం. నేరాలు చేసే రాజకీయ నాయకులు ఉన్నారు, అప్రమత్తంగా ఉండాలి. బాబాయిని చంపేసి ఆ నేరం నాపై మోపాలని కుట్ర పన్నారు. విధ్వంసమే అజెండాగా ముందుకెళ్లి రాష్ట్రాన్ని నాశనం చేశారు. మొన్న మావిగన్, నిన్న విజయవాడ, రేపు ఏమంటారో చూద్దాం? మతిస్థిమితం లేని వ్యక్తులతో రాజకీయం చేయడం నా చరిత్రలో చూడలేదు. మాటపై నిలబడ్డాం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముందుకెళ్తున్నాం. ఎవరెన్ని కుట్రలు పన్నినా మన రాజధాని అమరావతే. రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకొనే పరిస్థితి తీసుకొస్తామని' చంద్రబాబు వివరించారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే పెట్టుబడులు : ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని మరోసారి చెబుతున్నట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. గంజాయిపై ఉక్కుపాదం మోపి పూర్తిగా అరికట్టామన్నారు. గంజాయి సేవించిన వారిని వదిలిపెట్టట్లేదని చెప్పారు. గంజాయి బ్యాచ్‌ను వెనకేసుకొచ్చేవారిని ఏమనాలని ప్రశ్నించారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే పెట్టుబడులు వస్తాయని చంద్రబాబు తెలిపారు. ఒకప్పుడు రాయలసీమ నుంచి వలసలు వెళ్లేవారని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమలో అభివృద్ధి పరిగెడుతోందన్నారు. చంద్రబాబు విజన్, లోకేశ్ ఆలోచనలు, పవన్ నేతృత్వంలో అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా రాయలసీమ మారబోతోందని వివరించారు. అభివృద్ధి నినాదాలు కాదని, నిర్మాణ పనులు ప్రారంభమవుతున్నాయని శ్రీనివాసవర్మ వెల్లడించారు. గత పాలకులు రాయలసీమ అభివృద్ధిని పట్టించుకోలేదని శ్రీనివాసవర్మ ఆరోపించారు. వైఎస్ కుటుంబానికి రాయలసీమ అభివృద్ధి అంటే ఇష్టం ఉండదన్నారు. దిగ్గజ సంస్థ జేఎస్‌డబ్ల్యూ కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ నెలకొల్పడం అదృష్టమని తెలిపారు. రాయలసీమలో దిగ్గజ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ సీఎండీ సజ్జన్ సింధాల్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## రైలెక్కిన 63.81 కోట్ల మంది

జూన్ 2026లో ప్రయాణికుల రద్దీ సైతం స్థిరంగా పెరిగింది. గతేడాది ఇదే నెలలో 62.37 కోట్ల మంది ప్రయాణించగా, ఈసారి 63.81 కోట్ల మంది రైళ్లలో ప్రయాణించారు. స్వల్ప, దూర ప్రయాణాలకు ప్రయాణికులను చేరవేసే నాన్-సబర్బన్ విభాగంలో 3.9 శాతం వృద్ధి నమోదైంది. ప్రయాణికుల సంఖ్య 28.90 కోట్ల నుంచి 30.04 కోట్లకు పెరిగింది. సబర్బన్ విభాగంలోనూ 0.9శాతం వృద్ధితో 33.46 కోట్ల నుంచి 33.77 కోట్లకు చేరినట్లు రైల్వే వివరించింది. ప్రీమియం రైలు సేవల విస్తరణతో భారతీయ రైల్వే ప్రయాణికుల సేవలను ఆధునీకరిస్తోంది. వందేభారత్ సర్వీసుల సంఖ్య 164కు చేరింది. సామర్థ్య పెంపు, కార్యాచరణ సామర్థ్యం మెరుగుదల, ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని చేపట్టే కార్యక్రమాల ద్వారా సమర్థవంతమైన లాజిస్టిక్స్, నమ్మదగిన ప్రయాణికుల సేవలు, ఆధునిక రైల్వే మౌలిక సదుపాయాలను అందించడానికి భారతీయ రైల్వే కట్టుబడి ఉందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. జూన్ 2026లో భారతీయ రైల్వే 142.21 మిలియన్ టన్నుల సరకు రవాణా చేసింది. గతేడాది ఇదే నెలలో 136.71 మిలియన్ టన్నులు రవాణా కాగా, ఈసారి 4 శాతం వృద్ధి నమోదైంది. సరకు రవాణా ద్వారా జూన్



2025తో పోలిస్తే సుమారు రూ.430 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది, ఇది 3 శాతం ఎక్కువ అని కేంద్ర రైల్వే శాఖ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రధాన వస్తువుల్లో గణనీయమైన వృద్ధి కనిపించింది. ఎరువుల లోడింగ్ 19.1శాతం, ఇతర వస్తువుల రవాణాలో 17.3 శాతం వృద్ధి సాధించింది. ఇనుప ఖనిజం(9.4 శాతం), దేశీయ బొగ్గు(4.9శాతం), క్లింకర్ (7.2 శాతం) రవణాలోనూ వృద్ధిని కనబర్చింది. ఇది ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన రంగాల నుంచి కొనసాగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తోందని మంత్రిత్వశాఖ తెలిపింది.

మొదటి త్రైమాసికంలో 419.08 మిలియన్ టన్నుల సరకు లోడ్

2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో రైల్వే 419.08 మిలియన్ టన్నుల సరకును లోడ్ చేసింది. 2025-26 ఇదే కాలంలో 413.05 మిలియన్ టన్నులు కాగా, ఈసారి స్వల్ప వృద్ధి నమోదైంది. ఇనుప ఖనిజం లోడింగ్ 7.44 శాతం, క్లింకర్ 6.54 శాతం, ఇతర వస్తువుల రవాణా 12.16% పెరిగినట్లు రైల్వేశాఖ పేర్కొంది. వేసవి కాలంలో థర్మల్ పవర్ స్టేషన్ల అవసరాలను తీర్చేందుకు గతేడాది జూన్‌తో పోలిస్తే ఈ జూన్‌లో పవర్ ప్లాంట్లకు 7 శాతం ఎక్కువ దేశీయ బొగ్గును రైల్వే సరఫరా చేసింది. దీంతో దేశవ్యాప్తంగా నిరంతర విద్యుత్ ఉత్పత్తికి సహకారం అందినట్లు హర్షం వ్యక్తం చేసింది.

## మంగళగిరి క్షేత్రానికి కొత్త శోభ.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. దిగువ సన్నిధిలో రూ.6.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు కీలక పనులకు ఆయన ఇవాళ భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా చారిత్రక కట్టడాల పునరుద్ధరణతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. అంతకుముందు ఆలయానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు, అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నూతన యాగశాల నిర్మాణం, వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. చారిత్రక ప్రాధాన్యమున్న శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ పనులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పనులకు సంబంధించిన నమూనా చిత్రాలను పరిశీలించారు. ఆ తర్వాత మంత్రి లోకేశ్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా కలియతిరిగి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. చేపట్టే పనులన్నీ ఆలయ సంప్రదాయాలకు, ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిత్య ప్రసాద వితరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పుష్కరిణిని కూడా పరిశీలించి, దాని అభివృద్ధికి అవసరమైన సలహాలు ఇచ్చారు. దేవాదాయ శాఖ సమకూర్చిన రూ.6.3 కోట్ల నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా చారిత్రక శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ, నూతన యాగశాల, గంటా మండపం, వాహనశాల పునర్నిర్మాణం వంటి ముఖ్యమైన పనులు జరగనున్నాయి. మంగళగిరి క్షేత్ర పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ పనులను వేగంగా,



నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమం అనంతరం మంత్రి లోకేశ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్థానికులు, కార్యకర్తలతో కలిసి ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు పలువురు టీడీపీ ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## నైరుతి రుతుపవనాలతో దేశవ్యాప్తంగా వర్షాలు

మొదటి పేజీ తరువాయి

నైరుతి రుతుపవనాలు చురుకుగా కొనసాగుతున్నాయి. కేరళ, కర్ణాటక, తెలంగాణ, తీరప్రాంత ఆంధ్రప్రదేశ్ , తమిళనాడు, పుదుచ్చేరి, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. కేరళ, కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తాయి. తెలంగాణ, రాయలసీమలో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

మత్స్యకారులకు హై అలర్ట్

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో గంటకు 45-55 కి.మీ వేగంతో, గరిష్ఠంగా 65 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. అందువల్ల గుజరాత్ , కొంకణ్ , గోవా, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్ , ఒడిశా, బంగాల్ , ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరించింది. తీరప్రాంత ప్రజలు అధికారుల హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఈ వర్షాలు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించి వ్యవసాయ పనులకు ఊతం ఇచ్చినప్పటికీ, సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, ప్రకృతి విపత్తులకు దారితీసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

వరదలు వచ్చే ఛాన్స్ !

రానున్న రెండు మూడు రోజుల్లో రాజస్థాన్ , గుజరాత్ లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఉత్తర అరేబియా సముద్రంలోకి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నాయని తెలిపింది. ఇక వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతం కావడం, చురుకైన రుతుపవన ద్రోణి, బహుళ చక్రవాత చలనాలు, పశ్చిమతీరం వెంబడి నిరంతర తీరప్రాంత ద్రోణి వల్ల దేశం మొత్తం వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ వర్షాలు నేలలోని తేమను పెంచి ఖరీఫ్ పంటల సాగుకు మేలు చేస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా కురిసే భారీ వర్షాల వల్ల వరదలు, కొండచరియలు విరిగిపడడం, పంటకు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలు, ముఖ్యంగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ , పశ్చిమ కనుమల వంటి కొండ ప్రాంతాల్లో వరదలు, నీరు నిలిచిపోవడం, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ మార్గదర్శకాలను పాటించాలని సూచించింది. పశ్చిమ భారతదేశంలో అంటే గుజరాత్ , కొంకణ్ , గోవా, మధ్య మహారాష్ట్ర, సౌరాష్ట్ర & కచ్ ప్రాంతాల్లో జులై 3 నుంచి 5 మధ్య కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కనుక హఠాత్తుగా వరదలు వచ్చే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

ఆరెంజ్ అలెర్ట్ జారీ

దిల్లీ, పంజాబ్ , హరియాణా, ఉత్తరాఖండ్ , ఉత్తరప్రదేశ్ లో రానున్న కొద్ది రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 40-60 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీయవచ్చు. నైనిటాల్ , బాగేశ్వర్ వంటి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. అందుకే ఉత్తరాఖండ్ కు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇక మధ్యప్రదేశ్ , ఛత్తీస్ గఢ్ , విదర్భల్లో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిచే అవకాశం ఉందని అంచనా. అందుకే లోతట్టు, వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాల్ , ఝార్ఖండ్ , బిహార్ , సిక్కిం, అసోం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ , నాగాలాండ్ , మణిపూర్ , మిజోరం, త్రిపురల్లో కూడా విస్తారంగా, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. ఎక్కువ కాలం వర్షాలు కురిసే అవకాశం ఉంది కాబట్టి వరదలు రావడం, కొండచరియం విరిగిపడడం, రవాణాకు అంతరాయం కలగవచ్చని ఐఎండీ హెచ్చరించింది.

వర్షాలు పడుతున్నా వేడి, ఉక్కపోత ఎందుకు?


నైరుతి రుతుపవనాలు దేశంలోని మెజారిటీ ప్రాంతాలకు చేరినప్పటికీ, అనేక ప్రాంతాల్లో ఇంకా వేడి, ఉక్కపోత ఉన్నాయి. పర్యావరణ శాస్త్రవేత్త హిష్మీ హుస్సేన్ ప్రకారం, కేవలం వర్షపాతం ఒక్కటే ఉష్ణోగ్రతలను తగ్గించదు. హ్యూమిడిటీ ప్రభావం కూడా ఉంటుంది. అందుకే కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత ఉంది. నైరుతి రుతుపవనాలు అరేబియా సముద్రం, బంగాళాఖాతం నుంచ తేమను మోసుకొస్తాయి. కొద్దిసేపు వర్షం కురిసిన తర్వాత మళ్లీ ఎండ రావడం వల్ల తడి నేల వేడెక్కి ఆవిరి శాతం పెరుగుతుంది. అదే సమయంలో, రాత్రిపూట మేఘావృతమైన వాతావరణం, భూమి ఉపరితలం వద్ద వేడిని అడ్డుకోవడం వల్ల ఉష్ణోగ్రతలు తగ్గవు. దీనివల్ల వాతావరణం మరింత ఉక్కపోతగా మారుతుంది. ఈ తేమతో కూడిన గాలి అల్పపీడనాలు, చక్రవాత చలనాలు లేదా తీవ్రమైన భూఉపరితల ఉష్ణోగ్రతల వంటి వాతావరణ వ్యవస్థల ద్వారా పైకి లేచినప్పుడు మాత్రమే వర్షం కురుస్తుంది.

# సంపాదకీయం

## మరోసారి బ్యాంకుల కుదింపు తప్పదా?

దేశంలో పలువురు వ్యాపారవేత్తలు ఆరంభించిన ప్రైవేట్ బ్యాంకులు రెండు దశలుగా జాతీయం అయ్యాయి. అలా తమ ఆధీనంలోకి వచ్చిన 28 బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం దశలవారీగా కుదిస్తూ వస్తోంది. 20082017 మధ్య స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాని 7 అనుబంధ బ్యాంకులు విలీనమయ్యాయి. 2018లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ కలిసిపోయాయి. 2020లో పంజాబ్ నేషనల్ బ్యాంకులో రెండు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రెండు, కెనరా బ్యాంకులో ఒకటి, ఇండియన్ బ్యాంకులో ఒకటి చేర్చడంతో ఉన్న 28 బ్యాంకులు కూడా 12 అయ్యాయి. వందేళ్లకు పైగా ఉనికిలో ఉన్న బ్యాంకులు కూడా ఈ విలీన ప్రక్రియలో నామరూపాలు కోల్పోయాయి. ఆంధ్రా బ్యాంక్‌తో తెలుగువారికి ఓ ప్రాంతీయ అనుబంధం ఉండేది. యూనియన్ బ్యాంకులో ఆంధ్రా బ్యాంకును కలుపుతున్నప్పుడు తెలుగువారు బాధపడిపోయారు. ఈ కుదింపుల వల్ల ప్రధానంగా కేంద్ర ఆర్థిక శాఖపై నిర్వహణ భారం తగ్గుతుంది. ఒక ప్రాంతంలోని రెండు భిన్న బ్యాంకుల శాఖలు ఒక్కటైనపుడు సిబ్బంది, కిరాయి, రకరకాల బిల్లుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. దగ్గరలోని బ్యాంక్ మూసివేత జరిగినపుడు ఆ ప్రాంతంలోని ఖాతాదారులకు కొంత అసౌకర్యం కలిగే మాట నిజమే. అయితే బ్యాంకింగ్ సేవలన్నీ ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చినందువల్ల బ్రాంచ్ దూరమైన బాధ కొంత తీరవచ్చు. ఇదివరలో ఉన్నట్లు సర్వీస్ ఏరియా అప్రోచ్ విధానాన్ని ఎత్తివేయడం వల్ల ఏ బ్యాంకయినా ఏ ప్రాంతంలోనైనా అప్పులు ఇవ్వొచ్చు. భారీ లోన్ ప్రపోజల్స్ స్క్రూటినీ, శాంక్షన్ మొదలైన పనులు లోన్ హబ్‌లు చేస్తున్నందువల్ల శాఖలో పూర్తిస్థాయి అప్పుల విభాగం ఉండవలసిన అవసరం తగ్గింది. ప్రతి బ్యాంకూ పదేసి శాఖలకు ఒక లోన్ హబ్‌ను విడిగా ఏర్పాటు చేసుకొని సిబ్బంది, నిర్వహణ భారాన్ని తగ్గించుకుంటోంది. అవుట్ సోర్సింగ్ నుంచి లోన్ రికవరీ ఏజెంట్లను ఉపయోగించుకొనే విధానానికి ఆర్బీఐ అనుమతి ఉన్నందువల్ల కమిషన్‌పై మొండి బకాయిలను వసూలు చేసుకునే ప్రైవేట్ సైన్యాన్ని బ్యాంకులు వాడుకుంటున్నాయి. క్రెడిట్, డెబిట్ కార్డులు వచ్చాక ఒక్కొక్కరికీ నాలుగు బ్యాంకుల్లో ఖాతాలు అవసరమయ్యాయి. లాభదాయకతను బట్టి కస్టమర్లు క్షణాల్లో బ్యాంకులను మార్చేస్తున్నారు. ఒకప్పుడు డిపాజిట్లు, రుణాలపై ఆర్బీఐ వడ్డీ రేట్లను నిర్ణయించేది. ఇప్పుడంతా బ్యాంకుల ఇష్టమే. ఈ లెక్కన సంప్రదాయ బ్యాంకు విధానం నుంచి జాతీయ బ్యాంకులు ఎంతో దూరం జరిగిపోయాయి. అయితే ఈ విలీనమంతా ప్రభుత్వానికి మేలు జరిగే దిశలోనే జరిగిందని చెప్పాలి. కొన్ని బలహీన బ్యాంకులు ఈ విలీనం వల్ల బతికి బట్టకట్టాయి కూడా. అయితే ఈ చర్యలు ఉద్యోగ నియామకాలపై భారీగా ప్రభావం చూపాయి. గత అయిదేళ్ల కాలంలో బ్యాంకు ఉద్యోగుల హెచ్చు తగ్గుల వివరాలు కేంద్ర ఆర్థిక శాఖ సేకరించింది. దాని ప్రకారం 202125 మధ్యలో 12 బ్యాంకుల్లో కేవలం నాలుగింటిలో సిబ్బంది వందల్లో పెరగగా, మిగతా ఎనిమిదింటిలో మాత్రం వేలల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గింది. ఒక్క ఎస్బీఐలోనే 10 వేల మంది తగ్గిపోయారు. ఈ అయిదేళ్ల కాలంలో బ్యాంకు ఉద్యోగుల సంఖ్య కేవలం 6500 పెరిగింది. సగానికి పైగా సీనియర్ ఉద్యోగులు ఆధునిక బ్యాంకింగ్ సిస్టమ్‌కు తగినట్లు లేరని కేంద్ర బ్యాంకింగ్ డివిజన్ తేల్చినా, కొత్త నియామకాలు లేవు. కంప్యూటరైజేషన్, కుదింపు వల్ల ఉన్న సిబ్బందే ఎక్కువ అనే పరిస్థితి ఏర్పడింది. ఎస్బీఐ యోనో వంటి డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్లు సిబ్బంది రహితంగా పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి బ్యాంకుల కుదింపునకు కేంద్రం కమిటీ వేస్తున్నట్లు ఫైనాన్స్ పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 12 ప్రభుత్వరంగ బ్యాంకులను 4 లేదా 5 బ్యాంకులుగా మార్చాలనే ఆలోచన ప్రభుత్వానిది. యూనియన్ బ్యాంకులో బ్యాంక్ ఆఫ్ ఇండియాను కలిపేసే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు ఈ జనవరిలోనే బయటపడింది. ఇదే దారిలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులను తగ్గించే ప్రణాళిక కూడా ప్రభుత్వం దగ్గర ఉంది. ప్రస్తుతం ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 9 లక్షల ఉద్యోగులున్నారు. అందులో సగం మందితో బ్యాంకులు నడిచే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. కుదింపుతో పాటు బ్యాంకుల్లో విదేశీ పెట్టుబడులకు ఉన్న క్యాప్‌ను 49 శాతానికి పెంచే అవకాశాలు కూడా ఉన్నాయి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ ప్రస్తుతం 20శాతం పరిమితిలో ఉంది. దానికి కూడా ప్రభుత్వ అనుమతి అవసరం. షేర్ హోల్డర్ ఓటింగ్‌లో మాత్రం 10శాతం లెక్కలోకి తీసుకుంటారు. అప్పుడే విధానపర నిర్ణయాలపై ప్రభుత్వానిది పైచేయిగా ఉంటుంది. బయటి వాటా పెరిగితే బ్యాంకులపై దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్యను అయిదింటికి కుదించి, వాటిలోని 49శాతం వాటాను పెట్టుబడిదారులకు అమ్మేస్తే, ఆ పెత్తనం వారి స్వప్రయోజన మార్పులకు దారి తీస్తుంది.

# ఆహార భద్రతకు ముప్పు తప్పదా?




వాతావరణ పరిస్థితులు అంతకంతకు అధ్వానంగా మారుతున్నాయి. నిపుణులు 'తీవ్రస్థాయి సూపర్ ఎల్‌నినో' ముప్పు పొంచి ఉందంటూ హెచ్చరిస్తున్నారు. ఇండియా ఇప్పటికే దాని ప్రతికూల ప్రభావాలకు గురవుతోంది. పైగా ఈ ఏడాది రుతుపవన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90శాతమే ఉంటుందని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఇంతకీ దేశంపై ఎల్‌నినో ప్రభావం ఎలా ఉండనుంది? దాన్ని సమర్థంగా ఎదుర్కోవడమెలా? పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో కొన్నాళ్లకిందట తటస్థంగా ఉన్న 'ఎల్‌నినో-సదరన్ ఆసిలేషన్' పరిస్థితులు ఎల్‌నినో పరిస్థితులుగా మారుతున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మన దేశంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడేందుకు అవకాశం ఉన్నట్లు భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థ(ఐఐటీఎం), భారత వాతావరణ శాఖ(ఐఎండీ) పేర్కొన్నాయి. ఇతర అంతర్జాతీయ వాతావరణ నమూనాల అంచనాలూ ఇదే సూచిస్తున్నాయి. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో కనిపిస్తున్న తటస్థ ద్విధ్రువత(ఐవోడీ) పరిస్థితులు రుతుపవనాల కాలంలోనూ కొనసాగవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంటే, భారత్‌లో రుతుపవన కాలంలో ఎల్‌నినో ఏర్పడి, సెప్టెంబరు వరకు కొనసాగుతుందన్న మాట. దీనివల్ల వర్షపాతం గణనీయంగా తగ్గిపోయే ప్రమాదముంది. అంతవరకు మనం తీవ్రమైన వేడి, పొడి వాతావరణం, ఆలస్యపు వర్షాలతో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.

### జీవనోపాధికి గట్టి దెబ్బ!

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో శీతాకాలం వరకు కొనసాగవచ్చని పలు విదేశీ సంస్థలు సూచిస్తున్నాయి. ఇది మన రుతుపవనాలను తూర్పువైపు పసిఫిక్ మహాసముద్రంలోకి నెట్టే అవకాశం ఉంది. ప్రస్తుత ఉపగ్రహ డేటాను పరిశీలిస్తే, ఈ కదలిక స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌లో నమోదైన తీవ్రస్థాయి వడగాడ్పులు ఎల్‌నినో సంకేతాలేనని వాతావరణ నిపుణులు అంటున్నారు. ఈసారి వేసవిలో ఇండియా విపరీతమైన ఉష్ణోగ్రతలను చవిచూసింది. ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన పది నగరాలు మన దేశంలోనే ఉన్నాయని నివేదికలు తెలిపాయి. భారత ఉపఖండంలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండూ పెరిగాయి. మరోవైపు, హిమాలయాలకు ఉత్తరాన 2000-2500 కిలోమీటర్ల పొడవైన మేఘాల సమూహం ఏర్పడింది. ఇది దక్షిణ దిశగా దూసుకొచ్చి గంగా మైదాన ప్రాంతాల్లో వాతావరణ బీభత్సాన్ని సృష్టించవచ్చు. ఈ వింత వాతావరణ పరిణామాల కారణంగా ఒక్క యూపీలోనే 30కి పైగా జిల్లాలు బలమైన గాలులు, తుపానులు, భారీ వర్షాలను చూశాయి. ప్రజలు దీన్ని వేడి నుంచి ఉపశమనంగా భావించారు. కానీ, నిజానికి ఇది రుతుపవనాలు ఉపఖండం లోపలికి విస్తరించకుండా అడ్డుకుంటున్న వాతావరణ వైపరీత్యం! వాతావరణ పరంగా 2026వ సంవత్సరం తీవ్రమైన అనిశ్చితికి దారితీయవచ్చు. దీనివల్ల ఇక్కట్ల పాలవనున్న వర్షాధార రైతులను ఆదుకోవడంపై ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలి. ఎందుకంటే, మన సేద్య రంగంలో దాదాపు 60శాతం మంది వర్షాలపై ఆధారపడినవారే. పప్పుధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాల సాగు ద్వారా దేశానికి పౌష్టికాహారాన్ని అందించడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. వర్షపాతం సగటు కంటే తగ్గితే, అది కేవలం ఆహార భద్రతను మాత్రమే కాకుండా, లక్షలాది రైతుల జీవనోపాధిని కూడా నేరుగా దెబ్బతీస్తుంది. ప్రస్తుత అస్థిర, ఆలస్య వానల కారణంగా వర్షాధార రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం శ్రేయస్కరం కాదు. గడచిన అయిదేళ్లలో భారతదేశం అతితక్కువ వ్యవధిలో అత్యధిక వర్షపాతం నమోదైన జూన్ నెలను, అత్యంత పొడి వాతావరణం కలిగిన ఆగస్టు, అక్టోబరు నెలలను చూసింది. తీవ్రమైన వడగాడ్పులు, పశ్చిమ వాతావరణ కల్లోలాలు సంప్రదాయ వాతావరణ చక్రాలను పూర్తిగా మార్చేశాయి. దీనివల్ల వర్షాధార రైతులు తీవ్రంగా నష్టపోయి, అప్పుల ఊబిలో దిగబడిపోయారు. గడచిన అయిదేళ్లలో ఒక్క 2025-26లోనే రికార్డు స్థాయిలో ధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, 2021-22 నుంచి ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గడం వల్లే గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై తాత్కాలిక నిషేధం విధించాల్సి వచ్చింది. ఈ సమస్యలకు తోడు, ఇరాన్ యుద్ధం వచ్చిపడింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది.

### నిల్వ సామర్థ్యం పెంచాలి

ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం తగినన్ని ఎరువులను నిల్వ చేసినప్పటికీ, రబీ సీజన్‌కు అవి సరిపోకపోవచ్చు. వాతావరణ వైపరీత్యాలవల్ల పంటల సాగుకు రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరం మరింత పెరుగుతుంది. కానీ, ఇప్పటికే వీటికి తీవ్ర కొరత నెలకొంది. రాబోయే వాతావరణ పరిస్థితులపై విధానకర్తలు రైతులకు అవగాహన కల్పించాలి. ప్రతి జిల్లాలో వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాలను అందించాలి. వర్షాధార ప్రాంతాల్లో బహుళ పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించాలి. సేంద్రియ ఆవు పేడ, పెరటి ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలి. మట్టిలో సేంద్రియ పదార్థం పెరిగేకొద్దీ, నేల నీటిని నిలుపుకొనే సామర్థ్యం కూడా పెరుగుతుంది. జీవబొగ్గు(బయోచార్) సాయంతో నేల నాణ్యతను పెంపొందించే పద్ధతులను రైతులు పరిశీలించాలి. పొడి ప్రాంతాల్లో ఎక్కువగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును చేపట్టాలి. వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లో నీటిని, రసాయనాలను ఆదా చేయడానికి చిరుధాన్యాల సాగు మేలు. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోళ్లు పెంచడంతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలను అందించాలి. వర్షాధార ప్రాంతాల్లో అత్యధిక భూములను పంటల బీమా పథకం పరిధిలోకి తీసుకురావాలి. ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ఎంతైనా అవసరం. ప్రతి గ్రామంలోనూ రైతుల భాగస్వామ్యంతో గిడ్డంగులను ఏర్పాటుచేసి, నిర్వహించేలా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో పాటు ప్రతి పల్లెకూ ఆహార భద్రత చేకూరుతుంది.

# డిజిటల్ ఇండియాలో పేరు సంక్షోభం.. నా పేరు ఎలా రాయాలి?



భారతదేశం లాంటి సువిశాల, బహుళ సంస్కృతుల దేశంలో ఒక విధానాన్ని లేదా సాంకేతికతను దేశవ్యాప్తంగా అమలు చేయాలనుకున్నప్పుడు స్థానిక ఆచారాలు, సామాజిక జీవన విధానాలను పరిగణనలోకి తీసుకోవడం అత్యంత కీలకం. దురదృష్టవశాత్తూ, ప్రస్తుత డిజిటల్ పరిపాలనలో ఈ సమతుల్యత లోపించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ూ×=) ప్రక్రియ ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో సరికొత్త వివాదాలకు, పౌరుల తీవ్ర ఇబ్బందులకు కారణమవుతున్నది. ఈ ప్రత్యేక సవరణ డ్రైవ్‌లో భాగంగా ఆన్‌లైన్ ద్వారా ఓటర్ కార్డుల సవరణలు లేదా ఆధార్ అనుసంధానాలు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న లక్షల మందికి సాంకేతిక వ్యవస్థలు మొండిచేయి చూపుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఈ ప్రక్రియ కోసం వాడుతున్న సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో ఉన్న తీవ్రమైన లోపాలు.. భారతదేశ భౌగోళిక, సంస్కృతులపై ఉన్న అవగాహనా రాహిత్యమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఈ సమస్య కేవలం ఒక ఓటర్ల జాబితా సవరణకో, ఒక ప్రత్యేక డ్రైవ్‌కో పరిమితమైంది కాదు. అసలు మన దేశం లో ఒక పౌరుడి పేరును డిజిటల్ వ్యవస్థల్లో ఎలా నమోదు చేయాలి? అనే ప్రాథమిక అంశంలోనే ఒక సరైన ప్యాటర్న్, ఏకరూపత లేకపోవడం నేడు దేశవ్యాప్తంగా ఒక పెద్ద పరిపాలనాపరమైన, సామాజిక సంక్షోభానికి దారితీస్తున్నది.

### పేరు సంస్కృతి.. సాఫ్ట్‌వేర్ల నిరంకుశత్వం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల్లో శతాబ్దాలుగా ప్రజల జీవన విధానం ప్రకారం 'ఇంటి పేరు' అనేది అత్యంత ప్రాధాన్యమైనది.. అది ఎల్లప్పుడూ వ్యక్తి పేరుకు ముందే వస్తుంది. కానీ, జాతీయ స్థాయిలో డిజైన్ చేయబడే ఐటీ అప్లికేషన్లు అన్నీ పాశ్చాత్య లేదా ఉత్తరాది ప్యాటర్న్ అయిన 'ఫస్ట్ నేమ్, మిడిల్ నేమ్, లాస్ట్ నేమ్' అనే ఫార్మాట్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఉత్తరాదిలో ఇంటిపేరు లేదా కుల సూచికలు పేరు చివరన రావడం సాధారణం. ఈ రెండు భిన్నమైన సంస్కృతుల మధ్య సమన్వయం కుదర్చడంలో మన సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్స్ దారుణంగా విఫలమవుతున్నాయి. ప్రస్తుతం డేటా యాక్యూరసీని పరిశీలించే ఆటోమేటెడ్ టూల్స్ కేవలం అక్షరాల కలయికను మాత్రమే కాకుండా, పేరులోని స్థానాన్ని కూడా కచ్చితంగా పోల్చి చూస్తున్నాయి. దీనివల్ల ఒక వ్యక్తి ఆధార్ కార్డులో ఇంటిపేరు మొదట ఉండి, ఓటర్ ఐడీలో అది చివరన ఉంటే, అక్షరాలన్నీ వంద శాతం సరిపోయినప్పటికీ సిస్టమ్ దానిని తిరస్కరిస్తున్నది. కేవలం ఇంతటితోనే ఈ సమస్య ఆగడం లేదు. ఒక కార్డులో ఇంటిపేరు కేవలం ఒక అక్షరంగా (ఉదాహరణకు ఎస్పీ హరీశ్) ఉండి, మరో కార్డులో పూర్తి పేరు (శ్రీపెరంబుదూర్ హరీశ్) ఉంటే, వాటిని ఒకే వ్యక్తిగా గుర్తించే కనీస 'ఫజ్జీ లాజిక్' అల్గారిథమ్ కూడా ఈ వ్యవస్థల్లో లేదు. వీటికి తోడు ఇంగ్లిష్ నుండి తెలుగులోకి లేదా పేర్లను మార్చేటప్పుడు జరిగే గ్రామర్ దోషాలు, మహిళల వివాహానంతర ఇంటిపేర్ల మార్పులు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిగా సంక్లిష్టం చేస్తున్నాయి. ఫలితంగా ఆ దరఖాస్తులను సాఫ్ట్‌వేర్లు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాయి.

### దక్షిణాది ఇతర వర్గాల ప్రత్యేక చిక్కులు..

ఈ పేరు ప్యాటర్న్ సమస్య కేవలం హిందువుల ఇంటిపేర్ల దగ్గరే ఆగిపోవడం లేదు. దక్షిణాది ముస్లిం సమాజంలో పేరు పెట్టే పద్ధతులు మరింత భిన్నంగా, సంక్లిష్టంగా ఉంటాయి. అరబిక్ సాంప్రదాయాన్ని అనుసరించి కొందరు పేరు మధ్యలో 'బిన్' (దీఱఅ - కుమారుడు) లేదా 'బింతె' (దీఱఅ్వ - కుమార్తె) అని వాడుతుంటారు. డిజిటల్ ఫారాల్లో ఈ 'దీఱఅ' అనే పదాన్ని ఎక్కడ వేయాలో అర్థం కాక, అది మిడిల్ నేమ్‌గా మారిపోయి డేటాబేస్ మ్యాచ్ కాకుండా పోతున్నది. ఒక కార్డులో సయ్యద్ అహ్మద్ అని ఉంటే మరో కార్డులో కేవలం అహ్మద్ అని మాత్రమే ఉండటం వల్ల సిస్టమ్ రిజెక్ట్ చేస్తున్నది. ఇక తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో చాలా జిల్లాల్లో అసలు ఇంటిపేరే ఉండదు. తండ్రి పేరు లేదా పుట్టిన ఊరి పేరునే ఇంటిపేరుగా వాడుకుంటారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా కొందరు ఇదే చేస్తారు. ఇవన్నీ 'ఫస్ట్, మిడిల్, లాస్ట్' అనే మూడు ఫీల్డుల నిరంకుశ ఫార్మాట్లలో ఇరుక్కుపోయినప్పుడు.. లాస్ట్ నేమ్ అనేది తప్పనిసరి కావడంతో పేరును ముక్కలు చేసి రాయాల్సి వస్తుంది. రవికుమార్ సత్యం అనే పేరులో రవికుమార్ వ్యక్తి పేరు.. సత్యం తండ్రి పేరు అయితే, సత్యం అనేది లాస్ట్ నేమ్‌గా మారుతున్నది. దీనివల్ల కంప్యూటర్ జనరేట్ చేసే ఉత్తరాల్లో ఆ వ్యక్తిని 'మిస్టర్ సత్యం' అని డ్రాఫ్ట్ చేస్తున్నాయి.

### దేశవ్యాప్తంగా ఏకరూపత తేవాలి!

ఒకే దేశం - ఒకే గుర్తింపు అన్నప్పుడు, సాఫ్ట్‌వేర్ ఫార్మాట్ లు ఒక ప్రాంత సంస్కృతికి మాత్రమే అద్దం పడుతూ, మరో ప్రాంత ప్రజలను ఇబ్బంది పెట్టకూడదు. ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటే.. సమస్యను సులభంగా పరిష్కరించవచ్చు. ఉదాహరణకు సాఫ్ట్‌వేర్లలో 'ఫస్ట్, మిడిల్, లాస్ట్' అనే విభజనను పూర్తిగా తొలగించి, కేవలం 'పూర్తిపేరు' అనే ఒకే ఒక ఫీల్డ్‌ను ప్రవేశపెట్టాలి. దీనివల్ల వ్యక్తి తన సంస్కృతిని బట్టి ఇంటిపేరు ముందైనా, వెనకైనా రాసుకునే స్వేచ్ఛ ఉంటుంది. సాఫ్ట్‌వేర్ కేవలం వ్యక్తి పేరులోని అక్షరాల క్రమాన్ని, వయస్సును, తండ్రి లేదా భర్త పేరును మాత్రమే సరిచూసుకోవాలి. టెక్నాలజీ అనేది మానవ జీవితాన్ని సులభతరం చేయడానికి, ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడానికి ఒక సాధనంగా మాత్రమే ఉపయోగపడాలి. భారతదేశ వైవిధ్యా న్ని, బహుళత్వాన్ని గౌరవిస్తూ డిజిటల్ వ్యవస్థలను రీ-డిజైన్ చేసినప్పుడే, ఎలాంటి వివక్ష లేదా మినహాయింపులు లేని అసలైన 'డిజిటల్ ఇండియా' ఆవిష్కృతమవుతుంది.

# రేవంత్ శూన్య పాలన.. చిల్లర సవాళ్లు



తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై మంత్రి జూపల్లి కృష్ణారావు విసురుతున్న సవాళ్లు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రసంగాలు చూస్తుంటే.. పునాదులు తవ్వి, బిల్డింగ్ నిర్మించిన వాడిని పక్కనపెట్టి, పైన రంగులు వేసిన వాడు బిల్డింగ్ నాదే అన్నట్టున్నది! నేడు తెలంగాణలో రూపాయి ఆదాయం వస్తున్నదన్నా, ప్రభుత్వం జీతాలు ఇస్తున్నదన్నా.. దానికి మూలస్తంభం కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్లపాటు పకడ్బందీగా, ప్రణాళిక ప్రకారం నిర్మించిన అద్భుతమైన ఆర్థిక సామ్రాజ్యమే కారణం. ఆ నాడు శూన్యం నుంచి బంగారు తెలంగాణను నిర్మించిన ఒక మహానేత, సంపదను చేతుల్లో పెడితే, రాష్ట్రాన్ని దివాలా తీయించిన అసమర్థ పాలకుడి అసంబద్ధ రాజకీయానికి తాజా పరిణామాలు పరాకాష్ఠ! సమైక్య పాలకుల వివక్ష కారణంగా 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కరెంట్ కటకట ఉన్నది. వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకొన్నది. రైతుల ఆత్మహత్యలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. బడ్జెట్ అంచనాలు కేవలం రూ.66,000 కోట్లు. అలాంటి దుస్థితి నుంచి 2023 నాటికి దాదాపు రూ.3,50,000 కోట్ల బడ్జెట్ సాధించి తెలంగాణను దేశంలోనే అత్యంత ధనిక రాష్ట్రాల్లో ఒకటిగా నిలిపిన ఘనత కేసీఆర్‌ది. రాష్ట్ర సంపద (జీడీపీ) 177% వృద్ధి సాధించింది. 2014లో తెలంగాణ జీఎస్డీపీ కేవలం రూ.5.05 లక్షల కోట్లు. కానీ 2023-24 బడ్జెట్ నాటికి దానిని సుమారు రూ.14 లక్షల కోట్లకు తీసుకెళ్లారు. దేశ జనాభాలో కేవలం 2.9% కలిగిన తెలంగాణ.. దేశ జీడీపీకి ఏకంగా 4.9% సంపదను అందించి దేశంలోనే నంబర్‌వన్‌గా రికార్డు సృష్టించింది. తలసరి ఆదాయంలో దేశంలోనే టాప్‌లో నిలిచింది. 2014లో తెలంగాణ పౌరుడి సగటు తలసరి ఆదాయం రూ.1,12,162. దానిని 2023 నాటికి ఏకంగా రూ.3,17,115 కు పెంచి, దేశ సగటు (రూ.1,70,620) కంటే 86% ఎక్కువతో దేశంలోనే అగ్రస్థానం దక్కించుకున్నది. దేశంలోనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత, నాణ్యమైన త్రీ-ఫేజ్ విద్యుత్తు ఇచ్చిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌ది. కేసీఆర్ చేసిన అప్పులన్నీ వృథా అయ్యాయంటూ రేవంత్‌రెడ్డి, జూపల్లి ప్రెస్‌మీట్లలో అడ్డగోలుగా మాట్లాడారు. వారి దుర్మార్గమైన మాటలకు, వ్యవసాయ రంగం సాధించిన విజయాల గణాంకాలే చెంపపెట్టు. 2014లో తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం కేవలం 22.74 లక్షల ఎకరాలు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ జరిగిన తర్వాత, అది ఏకంగా 61.48 లక్షల ఎకరాలకు పెరిగింది. 2023-24 నాటికి వరి ఉత్పత్తిలో 168.75 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డుతో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా అవతరించింది. 2014లో రూ.50 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతుల విలువ.. 2023 నాటికి రూ.2.5 లక్షల కోట్లకు చేరింది. నాడు కేసీఆర్ తెచ్చిన అప్పులు కాళేశ్వరం ప్రాజెక్టుగా మారి, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరుగా మారి, నిరంతర విద్యుత్తు లైన్లుగా మారి ఇవాళ ప్రభుత్వానికి పన్నుల రూపంలో వేల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఇంతటి అద్భుతమైన ఆర్థిక పునాదిని రేవంత్‌రెడ్డి చేతిలో పెడితే, ప్రభుత్వ పనితీరు పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. రెండున్నరేండ్లుగా కాంగ్రెస్ తన అపరిపక్వ పాలనతో, ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూళ్ల దందాతో రియల్ ఎస్టేట్ రంగాన్ని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చింది. పైగా ప్రజలను ఏమార్చే విధంగా, రేవంత్ ప్రభుత్వం చెప్తున్న రూ.8 లక్షల కోట్ల అప్పు అనే కల్పిత కథనం వెనుక ఉన్న అసలు నిజాలను, వారి సొంత పరిపాలనా వైఫల్యాలను అధికారిక లెక్కలే తప్పు అని బయటపెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పార్లమెంట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం తొమ్మిదిన్నరేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.2,83,452 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక శ్వేతపత్రంలో రాష్ట్ర ప్రత్యక్ష, బడ్జెట్ పరిధిలోని అప్పు రూ.3,89,673 కోట్లు. కానీ అప్పు ఖాతాను కలగాపులగం చేసి, రూ.8 లక్షల కోట్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కేంద్ర ఆర్థికశాఖ, కాగ్ లెక్కల ప్రాతిపదికనే అప్పుల మీద చర్చ జరుగాలన్న కనీస జ్ఞానం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీలు కట్టడానికే ఖజానా ఖాళీ అవుతున్నదన్న రేవంత్‌రెడ్డి, జూపల్లి వాదనల్లో ఎలాంటి నిజం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో వార్షిక రుణాల అసలు, వడ్డీల చెల్లింపులు సగటున ఏడాదికి రూ.35,000 కోట్ల నుంచి రూ.38,000 కోట్ల మధ్య ఉండేవి. అధికారిక బడ్జెట్ పత్రాల ప్రకారం కాంగ్రెస్ సర్కార్ వార్షిక అప్పుల చెల్లింపు సుమారు రూ.35 వేల కోట్ల నుంచి రూ. 36 వేల కోట్ల మధ్యనే ఉన్నది. కొత్తగా ఏదో అప్పులభారం పడిపోయిందంటూ, తప్పుడు ప్రచారాలు చేస్తూ, తమ ప్రభుత్వ చేతకానితనాన్ని కప్పిపెట్టుకుంటూ, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు కుట్ర చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తూ కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సర్కార్, రాష్ట్ర ఆదాయ వనరులను పెంచడంలో ఘోరంగా విఫలమైంది. రాష్ట్రానికి అప్పు పుట్టడం లేదని చెప్తున్న రేవంత్, ఈ దుస్థితి తలెత్తడానికి తన అసమర్థ పాలనే కారణం అనే సంగతి మర్చిపోకూడదు. కాంగ్రెస్ గద్దెనెక్కినప్పటి నుంచి రెండున్నరేండ్లలో మార్కెట్ నుంచి దాదాపు రూ.4 లక్షల కోట్ల అదనపు అప్పు సేకరించింది. కానీ ఆ డబ్బు ఎటు పోయిందో ఎవరికీ తెలియదు. ప్రధాని మోదీతో 'బడే భాయ్ చోటే భాయ్" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు చెప్పుకొంటున్నా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులను సాధించడంలో ఘోరంగా విఫలమయ్యారు. కాంగ్రెస్ సర్కార్ నాటకాలు, చాలెంజ్‌ల ప్రెస్‌మీట్ల వెనుక ఉన్న అసలు రహస్యం.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చలేక పోవడమే.

